సాక్షి
చిత్తూరు
ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



కరెంట్ చార్జీలు తగ్గించాలి

కూటమి ప్రభుత్వం ప్రస్తుతం పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. - 8లో



గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

చిత్తూరు నగరంలోని చెంగల్రాయకొండ గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. స్వామివారిని పుష్పరథంలో ఊరేగించారు. - 8లో



ఏపేరి చెరువుకు గండి

వెదురుకుప్పం మండలంలోని ఏపేరి చెరువుకు గండి పడింది. దీంతో చెరువులో నీరు వృథా అవుతోంది. - 8లో

న్యూస్‌రీల్

రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం

● కలెక్టర్ సుమిత్‌కుమార్



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

యాదమరి (కాణిపాకం): రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ పేర్కొన్నారు. యాదమరి మండలంలోని కాశిరాళ్లలో శనివారం యాదమరి–పరదరామి రోడ్డు పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కలెక్టర్, ఎమ్మెల్యే మురళీ మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని, పూజలు చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో భాగంగా పాడైన రోడ్లకు త్వరితగతిన మరమ్మతులు చేయించాలన్నారు. ప్రజా సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నూతనంగా రోడ్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ రోడ్డు తమిళనాడు సరిహద్దు నుంచి యాదమరి పోలీసుస్టేషన్ వరకు 8 కిలోమీటర్లు నిర్మిస్తున్నామని, ఇందులో 4 కిలోమీటర్లు రోడ్డును కొత్తగా వేస్తామన్నారు. మిగిలిన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి సుమారుగా రూ.7.10 కోట్లు వ్యయం అవుతుందని పేర్కొన్నారు.

నేడు పొట్టిశ్రీరాములు వర్ధంతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన జిల్లా కేంద్రంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటలకు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు, అధికారులు విచ్చేయాలని బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహకారం

పూతలపట్టు (కాణిపాకం): ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు జిల్లా యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. శనివారం పూతలపట్టు మండలం బందార్లపల్లెలో రూ. 23 కోట్లతో నిర్మిస్తున్న ప్రైవేట్ సోలార్ ప్రాజెక్టుకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ఆసక్తిగల యువత ముందుకురావాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన రంగాలపై ఆధారపడకుండా పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుదలకు పారిశ్రామిక వేత్తలు కృషి చేయాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చి పరిశ్రమలు స్థాపిస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు.



ఎన్నికలు రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్న తొడతర రైతులు

ఎలాగైనా అధికారం చేజిక్కించుకునేందుకు టీడీపీ చేసే కుట్రలను ప్రత్యేకంగా చెప్పాల్సిన పనేలేదు. సాగునీటి సంఘాల్లో టీడీపీ అనుకూల అభ్యర్థులకు సహాయం చేసేందుకు కుట్రలు చేసి రైతులకు అన్యాయం చేశారు. శనివారం జిల్లా వ్యాప్తంగా సాగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో పారదర్శకత లోపించినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవణంపల్లి మండలం తొడతర సాగునీటి సంఘం రైతులు నీటి తీరువా పన్ను చెల్లించారు. అయితే ఆ పన్ను సకాలంలో చెల్లించలేదని సాకు చూపించి తొడతర సాగునీటి సంఘం ఎన్నికలు రద్దు చేయించేలా టీడీపీ కూటమి నాయకులు కుట్రలు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పద్మాపురం సాగునీటి సంఘం ఎన్నికల్లో కొట్టుకుంటున్న టీడీపీ నేతలు

టీడీపీలో కుమ్ములాట

జిల్లాలోని గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 43 సాగునీటి సంఘాలకు ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించుకున్నారు. ఆ నియోజకవర్గంలోని శ్రీరంగరాజపురం మండలం పద్మాపురంలో నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీకి చెందిన నాయకులే కుమ్ములాటకు దిగారు. ఆధిపత్యం కోసం శ్రీరంగరాజపురం మండలం టీడీపీ మండల అధ్యక్షుడు జయశంకర్‌నాయుడు, ఎస్సీ సెల్ నాయకులు గుండయ్య వర్గాలు తమ పంతాన్ని నెగ్గించుకునేందుకు ఆయకట్టుదారులతో ఘర్షణకు దిగారు. ఎన్నికలు జరిగే సమయంలో ఒకరినొకరు తోసుకుని ఘర్షణ పడ్డారు.

ఏకగ్రీవం.. అపహాస్యం

నిబంధనలకు తూట్లు..ముందుగానే టీడీపీ అనునయుల ఎంపిక.. ఎన్నికల్లో టీడీపేతరులకు అడ్డంకులు.. ఆయకట్టుదారులకు బెదిరింపులు.. స్థానిక సర్పంచ్‌లకు సైతం నో ఎంట్రీ.. ఈ తంతు కోసం పచ్చనేతలకు తలొగ్గిన అధికారగణం.. వెరసి కూటమి ప్రభుత్వం.. సాగునీటి సంఘాల్లో ఏకగ్రీవం అన్న మాటను అపహాస్యం చేసింది. ఎట్టకేలకు తమ విధేయులకు పదవులు కట్టబెట్టింది. ఇదీ సాగునీటి సంఘాల ఎన్నికల చిత్రం.

ఎన్నికల నిర్వహణకు అధికారుల సహకారం

- శ్రీరంగరాజపురం మండలం పద్మాపురం సాగునీటి ఎన్నికల్లో టీడీపీ వర్గీయులే కుమ్ములాట
- జిల్లా వ్యాప్తంగా అస్తవ్యస్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలు
- ముందుగానే అనుకూలమైన అభ్యర్థులను ఖరారు చేసుకున్న టీడీపీ
- కూటమికి తొత్తులుగా మారిన అధికారులు
- కుట్రలతో 217 నీటిసంఘాలు ఏకగ్రీవం
- రెండు సాగునీటి సంఘాలకే ఎన్నికలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా నియమ, నిబంధనలను పాటిస్తూ నిర్వహించాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను అస్తవ్యస్తంగా నిర్వహించారు. నిబంధనలను పాటించాల్సిన అధికారులు టీడీపీ కూటమికి తలొగ్గి తొత్తులుగా మారారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు అస్తవ్యస్తంగా సాగాయి. ఈ ఎన్నికల తీరుపై ఆయకట్టుదారులు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలను సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అపహాస్యం చేసిందని రైతులు మండిపడుతున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం పద్మాపురంలో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ నాయకులే చొక్కాలు పట్టుకుని కొట్టుకున్నారు. జిల్లాలో శనివారం సాగిన సాగునీటి కుట్ర ఎన్నికల తంతు ఇది.

అధికారుల సహకారంతోనే ఏకగ్రీవం

సాగునీటి సంఘాల్లో టీడీపీ కూటమి అభ్యర్థుల ఏకగ్రీవం కావడానికి అధికారులే సహకారం చేశారు. ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించేందుకు తొత్తులుగా మారి పూర్తి సహకారం అందజేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అదే పరిస్థితి కనిపించింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 8 గంటలకు 220 సాగునీటి సంఘాలకు ఎన్నికలు ప్రారంభమయ్యాయి. ప్రారంభం అయిన సమయం నుంచి మధ్యాహ్నం వరకు సాగిన ఈ ఎన్నికల్లో ఏకగ్రీవం కోసం కూటమి నాయకులు పోలింగ్ కేంద్రాల్లో గుమికూడారు. 9 గంటలకు ప్రతి సాగునీటి సంఘంలో ఆరుగురు సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. పలు చోట్ల ఏకాభిప్రాయం కుదరకపోవడంతో నామినేషన్ వేసేందుకు పలువురు ముందుకొచ్చారు. అయితే అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో గుమికూడిన టీడీపీ నాయకులు నామినేషన్‌దారులను అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. వారి మాట వినాల్సిందేనంటూ భయాందోళనకు గురి చేశారు. ఇలా మధ్యాహ్నం 3 గంటల్లోపు 220 సాగునీటి సంఘాల్లో 217 సంఘాలకు టీడీపీ కూటమి నాయకులు ఏకగ్రీవం చేసుకున్నారు. సదుం మండలంలోని తిమ్మనాయనపల్లిలో ఉన్న వ్యాసప్పచెరువు, చెరుకువారిపల్లి అయ్యవారి చెరువు నీటి సంఘాలకు మాత్రం ఎన్నికలు నిర్వహించారు. అలాగే పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లి మండలం తొడతర చెరువు సాగునీటి సంఘంలో ఆయకట్టుదారులు సకాలంలో నీటి తీరువా పన్ను చెల్లించలేదనే కారణంతో ఎన్నికలు నిలిపివేశారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికారుల సహకారంతోనే ఏకగ్రీవాలు అయినట్లు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నింద్ర జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో సాగునీటి సంఘాల ఎన్నికల తీరు

ఏక పక్షానికి కుట్రలు

ఇతర పార్టీల మద్దతుదారులు పోటీకి సిద్ధమైతే రహస్య బ్యాలెట్‌లో ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి వస్తుందని భావించిన టీడీపీ కూటమి కుట్రలకు తెరలేపింది. ఈ ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించిన విషయం విదితమే. ఇదే అదునుగా భావించిన టీడీపీ ఇతరులెవరూ పోటీ చేయనీయకుండా అడ్డుకున్నారు. పలమనేరు నియోజకవర్గంలో కనీసం సర్పంచ్‌లను సైతం రానివ్వకుండా పోలీసులచే అడ్డుకునేలా చేశారు. పోటీ చేసేందుకు వచ్చిన ఆయకట్టుదారులను ఆన్‌లైన్ పనిచేయలేదని చెప్పి, పోటీల్లో నుంచి తప్పించారు. పుంగనూరు మండలంలోని నెక్కొంది గ్రామంలో నిర్వహించిన సాగునీటి సంఘం ఎన్నికల్లో 40 ఏళ్లగా ఉన్న ఆయకట్టుదారులను పోటీ చేయనీయకుండా అడ్డుకున్నారు. చిత్తూరు నియోజకవర్గంలోని చిత్తూరు రూరల్ దిగువమాసాపల్లిలో టీడీపీకి చెందిన నాయకులు ఆధిపత్య పోరుతో మాటల యుద్ధానికి దిగారు. ఒకరినొకరు దూర్భాషలాడుకుంటూ కొట్టుకునే స్థాయిలో అరుచుకున్నారు. జిల్లా వ్యాప్తంగా చిత్తూరు, పుంగనూరు, కుప్పం, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో అర్హులైన ఆయకట్టుదారులను భయాందోళనకు గురి చేసి, పోటీ చేయనీయకుండా పంపేశారు. టీడీపీ కూటమి ముందస్తుగానే అనుకూలమైన వారిని అభ్యర్థులుగా ఖరారు చేసుకుని ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించుకుని మమ అనిపించారు.

సర్పంచ్‌ను లోనికి అనుమతించని పోలీసు

గంగవరం: మండలంలోని మామడుగు సచివాలయం వద్ద జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికల్లో ఓటు వేసేందుకు వెళుతున్న సర్పంచ్ భాస్కర్‌రెడ్డిని హోంగార్డ్ అడ్డుకున్నారు. సర్పంచ్ అయినప్పటికీ రైతుగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు సచివాలయంలోకి వెళుతున్న వ్యక్తిని హోంగార్డు కరుణాకర్ అడ్డుకోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సామరస్యంగా జరుగుతున్న ఎన్నికలకు తాను ఆటంకం కలిగించడం కోసం రాలేదని కేవలం తన ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం సచివాలయంలోకి ప్రవేశిస్తుంటే అడ్డుకోవడం ఏమిటని సర్పంచ్ ప్రశ్నించారు. ఎన్నికల అధికారులు కలగజేసుకోవడంతో సమస్య సద్దుమనిగింది.



మామడుగులో సర్పంచ్‌తో ఘర్షణ పడుతున్న పోలీసు

భగ్గుమన్న విభేదాలు

కార్వేటినగరం: సాగునీటి సంఘం ఎన్నికల సందర్భంగా టీడీపీ నాయకుల మధ్య ఉన్న విబేధాలు భగ్గుమన్నాయి. తొమ్మిద ఏళ్ల తరువాత జరిగిన సాగునీటి ఎన్నికల్లో తమ అనుకూలమైన వారినే ఎంపిక చేసుకోవాలని నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, కేడర్ ఉన్న సీనియర్ నాయకులు పట్టుపట్టడంతో ఇన్నాళ్లు దాగి ఉన్న విభేదాలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దీంతో తమ పంతాన్ని నెగ్గించుకునేందుకు తోపులాటలు, మాటల యుద్ధం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా శ్రీరంగరాజపురం మండలం ఆయకట్టుదారులు ఉన్న గ్రామాలను ఎంపిక చేయడకుండా ఆయకట్టులో లేని తమకు అనుకూలమైన గ్రామాలను ఎంపిక చేశారు. దీనిపై పద్మాపురం, పుల్లూరు, కమ్మకండ్రిగ, పోతగిల్లు, మంగుంట, దిగువ మంగుంట, డీబీఆర్ బయలు, మూలూరు, పిళ్లారికుప్పం గ్రామాల్లో వివాదం తలెత్తింది. గంగాధర నెల్లూరు, కార్వేటినగరం, పాలసముద్రం, వెదురుకుప్పం మండలాల్లో కూటమి ప్రభుత్వం నాయకులు తమ పంతాన్ని నెగ్గించుకునేందుకు పోటీదారులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. పాలసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో దండోరా వేయకుండా సాగునీటి ఎన్నికలు నిర్వహించడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీకి చెందిన ఒక వర్గం ఎన్నికలను వాయిదా వేసి రీ ఎలక్షన్ జరిపించాలని కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.



పాలసముద్రంలో రీఎలక్షన్ నిర్వహించాలని నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

అపూర్వం.. అపురూపం

పురాతన వస్తువులు..నేడు అలంకారప్రాయం.. ఇళ్లలో అలంకరణకు పరిమితం.. ఇదీ నేటి పరిస్థితి. అయితే కాలం మారినా.. ఆధునిక వస్తువులు అందుబాటులోకి వచ్చినా నేటికీ కొంతమంది అలనాటి జ్ఞాపకాలతో విడదీయలేని అనుబంధం పెంచుకున్నారు. వాటిని ఇప్పటికీ వినియోగిస్తూ ఆనందం పొందుతున్నారు. అపురూపంగా భావిస్తున్నారు. అలాంటి వారిపై ఆదివారం ప్రత్యేకం.

అలనాటి జ్ఞాపకాలు.. మరపురాని గుర్తులు

- రేడియో, టేపు రికార్డర్ ఉన్నా వినేవారు కరువు
- అలంకారప్రాయంగా మారిన చేతి గడియారాలు
- ఉత్తరాలు, టార్చ్‌లైట్, టెలిఫోన్‌ను తొక్కేసిన స్మార్ట్‌ఫోన్లు

SUNDAY SPECIAL



పోర్టబుల్ టీవీ వీక్షిస్తున్న అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఐరాల: మన చిరుప్రాయంలో చూసిన వస్తువులు నేడు అలంకార వస్తువులుగా మారాయి. పాత కాలపు చేతి గడియారాలు, రేడియోలు, ల్యాండ్ ఫోన్‌లు, ఉత్తరాలు, టేప్‌రికార్డర్ ఇళ్లలోని కబోర్డుల్లో బొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్ల సునామీలో ఎన్నో వస్తువులు కొట్టుకుపోయాయి. వాటిని ఇప్పుడు మ్యూజియంలో చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడు పాటలు వినాలనిపించినా, ఏదైనా సమాచారం కోసమైనా, టైమ్ చూడాలన్నా మన కళ్లు సెల్‌ఫోన్‌ను వెతుకుతున్నాయి. దీంతో అలనాటి వస్తువులు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. కానీ ఇప్పటికీ మండల కేంద్రంలో కొంత మంది టేప్ రికార్డులు, పోర్టబుల్ టీవీలు వాడుతున్నారంటే విశేషం.

ఇప్పటికీ పోర్టబుల్ టీవీ చూస్తున్నాం

మా కుటుంబ సభ్యులు ఇప్పటికీ పోర్టబుల్ టీవీ వీక్షిస్తున్నాం. మేము 18 సంవత్సరాల క్రితం ఈ టీవీని రూ.3వేలు ఇచ్చి కొనుగోలు చేసాం. ఇప్పటికీ టీవీ బాగా పనిచేస్తున్నాది. కాకపోతే ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు రిపేర్ అవుతున్నాది. మెకానిక్ దగ్గరకు తీసుకుపోతే రూ.500 నుంచి వెయ్యి రూపాయలలో బాగు చేసుకొని వస్తున్నాం. స్మార్ట్ టీవీ కొనాలంటే లక్షలు వెచ్చించి కొనుగోలు చేసినా ఒక్కసారి రిపేర్ వస్తే అదే లక్షలు ఖర్చు పెట్టాలి. అందుకే సార్ట్ టీవీల జోలికి వెళ్లకుండా పోర్టబుల్ టీవీనే వాడుతున్నాం.

– అమర్‌నాథ్‌రెడ్డి, వినాయకపురం, ఐరాల

నా జీవన శైలిలో టేప్ రికార్డర్ ముఖ్యభాగం



నా జీవన శైలిలో టేప్‌రికార్డర్ ముఖ్య భాగం అయిపోయింది. మా కుటుంబ సభ్యులతో కలిసి 1990వ సంవత్సరంలో టేప్‌రికార్డర్ (ఫిలిప్స్) రూ.2 వేలు ఇచ్చి కొనుకున్నాం. అందులోనే రేడియో అందుబాటులో ఉండేది. ఆ టేప్‌రికార్డర్, రేడియోతో నాకు గొప్ప అనుబంధం ఏర్పడింది. రేడియో ఎఫ్‌ఎం ద్వారా ఉదయం పూట భక్తిగీతాలు, మధ్యాహ్నం నుంచి హిందీ సినిమా పాత పాటలు. ప్రతి బుధవారం బహుళప్రాచుర్యం పొందిన బినాకా గీతమాల కార్యక్రమం గొప్ప ఆసక్తితో వినేదాని. ఇక మన ఆకాశవాణికి సంబంధించి తెలుగు కార్యక్రమాలను బాగా వినేదాని. టేప్‌రికార్డర్‌లో క్యాసెట్‌లు ద్వారా పాత తెలుగు సినిమా పాటలు వింటుంటే ఎంతో ఆనందంగా ఉండేది. సినిమాలు వినడానికి ఆదివారం కోసం ఎదురుచూసే వాళ్లం. ఈ సినిమాలు వింటే ప్రత్యక్షంగా సినిమా చూస్తున్న భావన కలిగేది. ప్రస్తుతం టేప్‌రికార్డర్ పాడైపోవడంతో 98.3 ఎఫ్‌ఎం ద్వారా రేడియోలో వచ్చే హిందీ పాటలు, తెలుగు జానపద గేయాలు, హరికథ, బుర్రకథలు వింటూ కాలక్షేపం చేస్తూ ఉంటాను. ముఖ్యంగా ఆకాశవాణి విజయవాడ ఎఫ్‌ఎం కేంద్రం రాత్రి పది గంటల నుంచి పదకొండు గంటలవరకూ ప్రసారం చేసే పాత తెలుగు సినీ గీతాలు తప్పక విని ఆ తర్వాతనే నిద్రకు ఉపక్రమించడం నా జీవన శైలిలో ఒక ముఖ్య భాగం అయిపోయింది.

– సరోజమ్మ, టీఎస్.అగ్రహారం, ఐరాల

సెల్‌ఫోన్‌తోనే సమయమంతా..

ఒకప్పుడు చేతికి గడియారం ఉంటే హుందాగా భావించేవారు. ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే బంగారు రంగు వాచీలకు డిమాండ్ ఉండేది. ఇప్పుడు కూడా వాచ్‌లు పెట్టుకునేవారు ఉన్నారు. గతంలో అలారం వాచ్‌లు ఎక్కువగా ఉపయోగించేవారు. త్వరగా లేవాలంటే అలారం పెట్టుకుని లేచేవారు. ఇప్పుడు చూద్దామన్నా అవి కనిపించడం లేదు. సెల్‌ఫోన్ రావడంతో అందులోనే నచ్చిన పాటలు పెట్టుకుని అలారం మోగే కొద్ది సమయానికి ముందుగా నిద్రిస్తున్నారు. కానీ కొందరు పాత తరం వారికి నాటి వినోద పరికరాలతో బంధం నేటికీ కొనసాగుతోంది. అలనాటి జ్ఞాపకాలను వారు మరిచిపోకుండా వినియోగిస్తున్నారు.

సత్వర న్యాయమే లోక్ అదాలత్ లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్‌అదాలత్ లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అన్నారు. రాజీమార్గం ద్వారా సత్వర న్యాయం పొందాలంటే లోక్ అదాలత్ సరైన వేదికన్నారు. శనివారం చిత్తూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లోర్ అదాలత్ నిర్వహించారు. చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎవరికైనా అన్యాయం జరిగినప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయిస్తారని, ఇక్కడ కేసుల విచారణ చట్టానికి లోబడి జరుగుతాయన్నారు. అయితే దీర్ఘకాలికంగా కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో కక్షిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీన్ని అధిగమించడానికి సుప్రీంకోర్టు ఆదేశాలతోనే లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ ఇరుపక్షాలకు చెందిన కక్షిదారులు తమ కేసులను అదాలత్‌లో శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీ చేసుకోదగిన కేసులను మాత్రమే అదాలత్‌లో సెటిల్ చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో బీమా, తపాలా, బీఎస్ఎన్ఎల్, విద్యుత్, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, ఎ క్సైజ్, చెక్‌బౌన్స్, మనీ రికవరీ సూట్లు, చిట్‌ఫండ్, కుటుంబ తగాదాలు, కార్మిక వివాదాలు లాంటి వాటిని ఇక్కడ పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అదాలత్‌లో పరిష్కరించిన కేసుపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం కూడా ఉండదని, ఇక్కడ ఇచ్చే తీర్పు అంతిమం అన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడంతో కక్షిదారుల కోర్టుల చుట్టూ తిరిగే అవసరం ఉండదన్నారు. సమయం, డబ్బు ఆదా అవుతుందని కక్షదారులు స్నేహ పూర్వకంగా కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి, న్యాయమూర్తులు వెన్నెల, పద్మజ, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేసులు పరిష్కరించుకున్న వారికి ధ్రువ పత్రాలను అందజేశారు.

ఆర్థికాభివృద్ధికే స్త్రీనిధి రుణం



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో అర్హులైన మహిళలకు మంజూరు చేసే స్త్రీనిధి రుణం ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలకే వినియోగించేలా చర్యలు చేపడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో స్త్రీనిధి 18 వ సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయి సిబ్బందితో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పీడీ మాట్లాడుతూ జిల్లాలో క్షేత్రస్థాయిలో ఎక్కడా నిధుల దుర్వినియోగం జరగడానికి వీల్లేదన్నారు. స్త్రీనిధి స్వయం సహాయక సంఘాల కోసం ఏర్పాటు చేసుకున్న బ్యాంకు అని చెప్పారు. అన్ని బ్యాంకుల వలే సిబిల్ స్కోర్ చూసి రుణాలు ఇచ్చేలా అభివృద్ధి చెందాలన్నారు. సంఘాల్లో కచ్చితంగా డిజిటల్ పేమెంట్ విధానం అమలు చేయాలన్నారు.నిరర్థక ఆస్తుల విషయంలో ప్రతి 15 రోజులకొకసారి క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షిస్తామన్నారు. అనంతరం స్త్రీ నిధి విధి విధానాలు, 2023–24 సంవత్సరం లాభనష్టాలు, ఆస్తులు, బాధ్యతలు చదివి వినిపించారు. ఈ సమావేశంలో జిల్లా స్త్రీ నిధి ఏజీఎం వెంకటప్రకాష్, ఫైనాన్స్ డీపీఎం రవికుమార్, ఐబీ ఏపీఎం సుబ్బారెడ్డి, స్త్రీ నిధి మేనేజర్లు భార్గవ్, మోహన్, శరత్, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐసీటీతో ఒప్పందం సంతోషం


ఐసీటీతో ఒప్పందం చేసుకుంటున్న కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు

కుప్పంరూరల్: ప్రతిష్టాత్మకమైన సంస్థ ఐసీటీతో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషదాయకమని ఆ కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు అన్నారు. ఒప్పందం ద్వారా విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతికత, ఆవిష్కరణలు అందిపుచ్చుకునే వీలు కలుగుతుందన్నారు. ఐసీటీ సంస్థ ఇంజినీరింగ్ కళాశాలకు 'మ్యాంగోడీబీ' అవార్డు అందజేయడం శుభసూచికమన్నారు. ఇకపై కుప్పం ఇంజినీరింగ్ కళాశాల, ఐసీటీ సంస్థ పరస్పరం సాంకేతిక అందిపుచ్చుకుని ముందుకు సాగుతాయన్నారు. కళాశాల వైస్‌చైర్మన్ సునీల్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ స్థాయి సమావేశం


సునీల్‌కుమార్

తవణంపల్లె: వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ సర్వసభ్య సమావేశం ఆదివారం తవణంపల్లె మండలంలో నిర్వహిస్తామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సునీల్ కుమార్ తెలిపారు. తవణంపల్లె మండలం సిద్ధంపల్లె సమీపంలోని కాణిపాకం రోడ్డులో ఉన్న నారాయణాద్రి కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, పార్లమెంటు మాజీ సభ్యుడు రెడ్డెప్ప ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. సర్వసభ్య సమావేశానికి నియోజకవర్గంలోని తవణంపల్లె, ఐరాల, బంగారుపాళెం, పూతలపట్టు, యాదమరి మండలాల్లోని పార్టీ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ అభిమానులు తప్పక హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్మికశాఖ కార్యాలయం మార్పు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక పాత కలెక్టరేట్‌లోని కార్మికశాఖ కార్యాలయాన్ని కొత్తకలెక్టరేట్‌కు మార్పు చేశారు. శనివారం కార్యాలయాన్ని పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ ప్రారంభించారు. పాత కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ భవన్‌లోని రెండో అంతస్తుకు మార్పు చేసినట్లు ఇన్‌చార్జ్ జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు తెలిపారు. సహాయకార్మికశాఖాధికారి జగదీష్ పాల్గొన్నారు.



పొదుపు మంత్రం.. కాంతివంతం

- విద్యుత్ పొదుపుతో బిల్లు ఆదా
- యూనిట్లు తగ్గితే అదుపులో శ్లాబ్ ధరలు
- 14 నుంచి జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు
- జిల్లాలో ప్రారంభం కాని కార్యక్రమం

> ఏ రంగంలోనైనా పొదుపు అవసరమే. ఇంధనం ఆదా చేయడమంటే వనరులను సమర్థవంతంగా వినియోగించుకున్నట్లే. ఇది సుస్థిర అభివృద్ధికి ఆధారంగా మారుతుంది. ఇందుకు ఇంట్లో గృహోపకరణాల వాడకంలో మెళకవలు పాటించాల్సి ఉంది. పొదుపు మంత్రం పాటిస్తేనే బిల్లు అదుపులో ఉండి, వినియోగదారుడికి అధనపు ఖర్చు తగ్గుతోంది.

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్‌ను మనం ఉత్పత్తి చేయకపోవచ్చు కానీ, వృథా చేయకుండా పొదుపు చేస్తే పరోక్షంగా ఉత్పత్తి చేసినట్లే. అనవసరంగా కరెంట్ వాడకూడదు. తద్వారా వినియోగించే యూనిట్లు తగ్గి, బిల్లు స్లాబ్ రేట్లు తగ్గుతాయి. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాలు జిల్లాలో జరగనున్నాయి. ముఖ్యంగా ఇంట్లో వాడుకునే 10 వస్తువుల వినియోగం సక్రమంగా ఉంటే ప్రతి ఒకరూ విద్యుత్‌ను పొదుపు చేయవచ్చని, ఫలితంగా విద్యుత్ బిల్లుల తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు. కరెంటు ఆదాపై గృహాల్లో వినియోగించే వస్తువులు, వాటిని ఎలా వినియోగిస్తే విద్యుత్‌ను ఆదా చేయవచ్చనే అంశంపై అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. జిల్లాలో అన్ని రకాల సర్వీసులు మొత్తం 7.52 లక్షలున్నాయి. వీటి ద్వారా నెలకు 6.62 కోట్ల యూనిట్లు వాడుతున్నారు. బిల్లుల చెల్లింపుల ద్వారా నెలకు రూ.50 కోట్లకు పైగా సంస్థకు ఆదాయం వస్తోంది.

• బల్బులు ఎప్పటికప్పుడు ఆఫ్ చేయాలి

అవసరం లేనప్పుడు బల్బులను వెంటనే ఆఫ్ చేయాలి. కిటికీలను తెరచి ఉంచడం, లేత రంగుల కర్టెన్లను ఉపయోగిస్తే పగటి కాంతి ఇంట్లోకి వస్తుంది. ఎల్‌ఈడీ బల్బులు వాడటం మంచిది. బాత్రూమ్‌ల్లో చిన్న బల్బులను వాడాలి.

• ఫ్యాన్లు : ఫ్యాన్ లేని ఇల్లు ఉండదు. మనం ఏ గదిలో ఉంటామో అక్కడే ఫ్యాన్ ఆన్ చేసుకోవాలి. అక్కడి నుంచి మరో గదిలోకి వెళ్లినప్పుడు ఆఫ్ చేయడం మరచిపోవద్దు. రెగ్యులరేటర్‌ను కచ్చితంగా వాడాలి. ఇప్పుడు తక్కువ కరెంటు వినియోగంతో ధారాళంగా గాలి వచ్చే ఫ్యాన్లు వస్తున్నాయి. వాటిని వాడాలి.

• మిక్సీలు : రోజువాడే వస్తువుల్లో మిక్సీలు, గ్రైండర్లు ముఖ్యమైనవి. పొడిగా ఉండే వాటిని మెదపడానికి ఇవి ఎక్కువ సమయం తీసుకుంటాయి. కాబట్టి ఎక్కువగా పొడులు చేయడం తగ్గించుకోవాలి. ఫైవ్‌స్టార్ రేటింగ్ ఉండే గృహోపకరణాలను వాడితే మంచిది.

• విద్యుత్ పొయ్యి : ఆహార పదార్థాలు వండడానికి నిర్దేశించిన సమయానికంటే కొన్ని నిమిషాల ముందే విద్యుత్ స్టౌవ్‌ను ఆఫ్ చేయాలి. సమతులమైన అడుగును కలిగిన వంటపాత్రలను ఉపయోగించాలి. దీంతో విద్యుత్ సద్వినియోగమై వంట త్వరగా పూర్తవుతుంది.



• టెలివిజన్ : టీవీ లేని ఇల్లు ఉండదు. ఇప్పుడు అంతా ఎల్‌ఈడీ, ఎల్‌సీడీ ఆధునాతన టెక్నాలజీతో వస్తున్నాయి. ఒక్కోసారి మనం టీవీ ఆన్ చేసి ఇతర పనుల్లో నిమగ్నమవుతాం. అలా కాకుండా చూసిన తరువాత ఆఫ్ చేయడం మరిచిపోవద్దు. ఆన్‌లో ఉంటే 10 వాట్ల శక్తిని నష్టపరుస్తుంది.

• కంప్యూటర్లు : డెస్క్‌టాప్‌లు, ల్యాప్ టాప్‌లు ఉపయోగించన అనంతరం ఆఫ్ చేయడం మంచిది. ఎందుకంటే 24 గంటలు పని చేసే ఒక కంప్యూటర్, ఫ్రిజ్ కన్నా ఎక్కువ శక్తిని వినియోగిస్తుంది. స్లీప్ మోడ్ ఉండేలా సెట్‌చేసి విద్యుత్‌ను ఆదా చేయవచ్చు.

• హీటర్ : చలికాలంలో వేడినీటితో స్నానం తప్పనిసరి. నీటిని వేడి చేసేందుకు విద్యుత్ హీటర్ బదులుగా సోలార్ వాటర్ హీటర్‌ను ఉపయోగించడం ఉత్తమం. విద్యుత్ హీటర్ ఎక్కువ కరెంటు తీసుకుంటుంది. కొంత ప్రమాదకరం కూడా. రోజువారీగా చెక్ చేసుకుంటూ పోతే సోలార్‌కు పెద్దగా ఖర్చు ఉండదు.

• మైక్రో ఓవెన్స్ : ఇవి సంప్రదాయక విద్యుత్ లేదా గ్యాస్ స్టౌ కన్నా 50 శాతం తక్కువ శక్తిని వినియోగిస్తాయి. ఆహార పదార్థాలు ఓవెన్‌లో పెట్టాక చూడడానికి మాటిమాటికి తలుపు తెరవద్దు. అలా తెరిచిన ప్రతిసారి 25 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత తగ్గిపోతుంది. మళ్లీ వేడెక్కడానికి విద్యుత్ ఖర్చు వుతుంది.

వారోత్సవాలు ఇలా

- ఈ నెల 14వ తేదీన విద్యుత్ పొదుపు వారోత్సవాల కార్యక్రమం ప్రారంభించిన అనంతరం ర్యాలీ నిర్వహించనున్నారు.
- 15వ తేదీన స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కార్యక్రమం. – 16న స్కూల్ పిల్లలకు విద్యుత్ వాడకం పై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు.
- 17 కళాశాల విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు.
- 18న ప్రభుత్వ కార్యాలయాల నందు విద్యుత్ పొదుపు పై పోస్టర్లు పంపిణీ.
- 19న గ్రామీణులకు విద్యుత్ వాడకం జాగ్రత్తల పై అవగాహన.
- 20న పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

ప్రారంభం కానీ కార్యక్రమం

తిరుపతిలో అధికారుల సమావేశం పేరుతో శనివారం పొదుపువారోత్సవాలను ప్రారంభించలేదు. దీంతో తొలిరోజు కార్యక్రమాలన్నీ తూచ్ అన్నారు. ఇక ఆదివారం నిర్వహించాల్సిన మహిళ సంఘాలకు అవగాహన కార్యక్రమాలు సెలవుదినం కావడంతో ఉండదని అధికారులు అంటున్నారు. సోమవారం తర్వాత తూతూ మంత్రంగా విద్యార్థులకు పోటీలు పెట్టనున్నారు. 20న అందులో గెలిచినవారికి బహుమతులు ఇచ్చి అధికారులు మమ అనిపించనున్నారు.

పొదుపుగా వాడాలి



"విద్యుత్ పొదుపు నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలి. దీంతో బిల్లు పెరగదు. వినియోగదారులు విద్యుత్ చాలా తక్కువగా వినియోగించే ఉపకరణాలను వాడాలి. తిరుపతిలో ఏపీఈఆర్సీ సమావేశంతో జిల్లాలో వారోత్సవాల ప్రారంభం కార్యక్రమం నిర్వహించలేదు. విద్యుత్ వాడకంపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తాం.

– ఇస్మాయిల్‌అహ్మద్, ఎస్‌ఈ, ట్రాన్స్‌కో

ఏపేరి చెరువుకు గండి


చెరువుకు కట్టకు పడిన గండి

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయతీ ఏపేరి గ్రామంలో ఉన్న చెరువుకు గండి పడింది. చెరువు కట్ట వద్ద పెద్ద రంధ్రం పడడంతో చెరువులో నీరు వృథా అవుతోంది. అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టకపోతే చెరువులో నీరు ఖాళీ అవుతోందని ఆయకట్టు రైతులు అంటున్నారు. సుమారు 18 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువు ఇటీవల వర్షాలకు నిండి, మొరవ పారుతోంది. అయితే చెరువు కట్ట వద్ద గండి పడడంతో చెరువులో నీరు పొలాల్లో ప్రవహిస్తోంది. నీటి ఉధృతికి గండి పెద్దది అవుతుందని స్థానికులు చెబుతున్నారు. చెరువులో నీరు లేకుంటే ఈ చెరువు ఆయకట్టు సుమారు 100 ఎకరాలు భూములు బీడుపోయాయని తెలిపారు. అలాగే చెరువు కింద ఉన్న వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటిపోయి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఏపేరి, రెంటాలచేను, చింతలగుంట గ్రామాలకు చెందిన రైతులు వరి, వేరుశనగ, చెరకు పంటలు సాగు చేస్తున్నట్లు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలి

వి.కోట: కూటమి ప్రభుత్వం ప్రస్తుతం పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని భారత్‌నగర్ కట్టమీదవీధిలో పెంచిన కరెంట్ బిల్లులకు నిప్పుపెట్టి దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి నేతలు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ బిల్లులు పెంచమని హామీ ఇచ్చారని, హామీలను తుంగలో తొక్కుతూ ప్రస్తుతం కరెంట్ బిల్లు పెంచి పేదల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికైనా కరెంట్ చార్జీలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సభ్యులు, బాధిత మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

– విద్యాశాఖ మంత్రికి ఆపస్ సంఘం వినతిపత్రం


మంత్రి లోకేష్ కు వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు తప్పనిసరిగా పరిష్కరించాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విజయవాడలో మంత్రి నారా లోకేష్ కు ఉపాధ్యాయుల డిమాండ్ల వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఓ 117 రద్దు, పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూలు ఏర్పాటు చేసి, తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలన్నారు. విద్యార్థుల సంఖ్య 80 దాటిన పాఠశాలకు ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ పోస్టు ఇవ్వాలని కోరారు. తెలుగు మీడియం కొనసాగించాలన్నారు. హై స్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని, అన్ని మండలాల్లో పంచాయతీ రాజ్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. జూనియర్ కళాశాలల్లో 40 శాతం కోటా ప్రమోషన్లు పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయుల సెలవుల వినియోగంపై ఎటువంటి ఆంక్షలు ఉండకూడదని కోరారు. బదిలీలకు అకాడమిక్ ఇయర్స్ ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పారు. మెమో నంబర్ 57 అమలు చేసి 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. యాప్‌ల భారాన్ని తొలగించాలని కోరారు. ఎంటీఎస్ 1998, 2008 టీచర్ల ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

22న విశ్వంలో గణిత ప్రతిభా పరీక్ష


గణిత ప్రతిభా పరీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 22న గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ విద్యా సంస్థ అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రతిభా పరీక్షకు సంబంధించిన సమాచార పత్రికను శనివారం అపుస్మా నేతలు వెంకటేశ్వర్లు, రవీంద్రారెడ్డి, సంగరాజు భాస్కర్‌రాజు, ఎస్ఎం.బాషా, విశ్వం విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గణిత ప్రతిభా పరీక్షను వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్, న్యూ బాలాజీ కాలనీలోని ఎంఎంబీజీ స్కూల్లో 5 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తరగతి వారీగా ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 86888 88802 నంబర్ ద్వారా వాట్సాప్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

పంచముఖ హనుమద్దీశ్వరుడిపై సూర్యకిరణాలు


హనుమద్దీశ్వరుడిపై పడుతున్న సూర్యకిరణాలు

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట గ్రామంలో నిర్మిస్తున్న పంచ ముఖ హనుమద్దీశ్వరుడిని శనివారం సూర్యకిరణాలు తాకాయి. దాత బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్‌కే రమణారెడ్డి తన సొంత నిధులతో ఏ.కొత్తకోట గ్రామంలో పంచ ముఖ హనుమద్దీశ్వరుడి 60 అడుగుల ఎత్తైన విగ్రహం నిర్మిస్తున్నారు. శనివారం ఉదయం సూర్యకిరణాలు విగ్రహంపై పడ్డాయి. మేరువ ఏర్పాటు చేసి ఉన్నప్పటికీ అవేవి కనపడకుండా సూర్యుడు కాంతి వంతంగా ప్రకాశిస్తూ విగ్రహం పడుతున్న దృశ్యం సీసీ కెమరాల్లో నమోదైంది. దాత గ్రామస్తులకు తెలపడంతో ఆశ్చర్యకరంగా తిలకించారు.

డీఎల్ఎస్ఏ కార్యదర్శిగా భారతి


భారతి

చిత్తూరు అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శిగా, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి చిత్తూరులో బాధ్యతలు తీసుకున్నారు. చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలోని న్యాయసేవాసదన్ భవనంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో పనిచేస్తున్న భారతికి పదోన్నతి కల్పిస్తూ, చిత్తూరులో ఖాళీగా ఉన్న స్థానానికి బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు



చిత్తూరురూరల్ (కాణిపాకం): చిత్తూరులోని చెంగల్రాయకొండ గిరిప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. పౌర్ణమిని పురస్కరించుకుని చిత్తూరులోని చెంగ ల్రాయ కొండపై వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం గిరిప్రదక్షిణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తికి విశేషాలంకరణ చేసి పుష్ప రథంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులుగిరి ప్రదక్షిణ చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. దారి పొడవునా అన్నదానం చేశారు.